సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



ముగిసిన సుధాకర్ ప్రస్థానం

చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన మావోయిస్టు అగ్రనేత సుధాకర్, అతడి భార్య సుమన మృతదేహాలను శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. - 8లో▸



రూ.7.72లక్షల నగదు స్వాధీనం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో రూ.7.72లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం 41°/27°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

22వ తేదీ వరకు గడువు

రామన్నపేట: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ -2024కు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన, టెన్త్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. www.polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులు రూ.500 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 24వ తేదీ వరకు రూ.100 అపరాధ రుసుము, ఏప్రిల్ 26వ తేదీ వరకు రూ.300 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రేపు జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 21న హనుమకొండ జిల్లా స్థాయి జూనియర్ (అండర్-18) బాల బాలికల బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లపెల్లి రాజు, దోలి సాంబయ్య శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించే ఎంపికలకు ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకుని స్కూల్ గ్రౌండ్ వద్ద హాజరు కావాలని తెలిపారు. జనవరి 01, 2006 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు హైదరాబాద్‌లోని మియాపూర్ డీపీఎస్ స్కూల్ గ్రౌండ్‌లో జరగనున్న అంతర్ జిల్లాల స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు ఇక్బాల్ 83284 49263 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి..

హసన్‌పర్తి: ఈనెల 21న నిర్వహించనున్న తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను http://tsrjdc.cgg.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్ ఇందుమతి తెలిపారు. కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం నిమిత్తం 98665 59727 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న వర్క్‌షాప్




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ రెండో రోజు శుక్రవారం కొనసాగింది. యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి మాట్లాడుతూ.. సరైన పరిశోధన అంశం ఎంపికతోనే పరిశోధనపై జిజ్ఞాస పెరుగుతుందన్నారు. పరిశోధన అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల స్కీంకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించిన ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల స్కీంకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27లోపు ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



వరంగల్ అర్బన్: ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని బల్దియాకు చెందిన క్యూసీ (క్వాలిటీ కంట్రోల్) కార్యాలయంలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నాణ్యతా ప్రమాణాల తీరును పరిశీలించి, నిర్ధారణ విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు కమిషనర్‌కు కోర్ కటింగ్ చేసే విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో ఈఈ సంజయ్‌కుమార్, ఏఈ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానుకోట.. కాంగ్రెస్ కంచుకోట

జన జాతర సభలో జోష్ నింపిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం





సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయో చూస్తా..

గెలిచే స్థానాల్లో మొదటి రెండు స్థానాలు ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ ఉంటాయి. ఇరు పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు పొంగులేటి, తుమ్మల ఇక్కడే ఉన్నారు. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో ఎవరు ఎక్కువ మెజార్టీ తెస్తారో చూస్తాం. ప్రజలను ఇబ్బందులు పెట్టి.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే నరేంద్ర మోదీ, ఆయనకు మద్దతుగా ఉన్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పాల్సిందే. ఈ రెండు పార్టీలను ఓడించేందుకు మీరు (ప్రజలు) సిద్ధమేనా.. - సీఎం రేవంత్‌రెడ్డి

- బీజేపీ, బీఆర్‌ఎస్‌పై విమర్శనాస్త్రాలు
- కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడిన మంత్రులు
- చేతులు ఊపుతూ.. దండం పెట్టే పనిలో అభ్యర్థి బలరాంనాయక్



ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం మానుకోటలో నిర్వహించిన జనజాతర సభలో సీఎం రేవంత్ ప్రసంగం ఆద్యంతం పార్టీ శ్రేణులు, ప్రజల్లో జోష్ నింపుతూ సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3.15 గంటలకు మహబూబాబాద్ చేరుకున్నారు. అప్పటికే ఆయన అలసిపోవడంతో బస్సులో విశ్రాంతి తీసుకొని సాయంత్రం 5.16 గంటలలకు సభా వేదికపైకి వచ్చారు. 6.17 గంటల వరకు ప్రసంగం సాగింది. సీఎం వచ్చిన తర్వాత తొర్రూరు, డోర్నకల్ ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. అప్పటి వరకు కాసేపు పొంగులేటి, తర్వాత తుమ్మలతో సీఎం ముచ్చటించారు. సీఎం వేదికపైకి వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్ పైకి వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. తర్వాత మానుకోట.. ఎప్పటికి కాంగ్రెస్ కంచుకోట.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించి మొదటి మాటతోనే కార్యకర్తలు, ప్రజల్లో ఉత్తేజాన్ని నింపారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌పై విమర్శలు

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను విమర్శించడమే లక్ష్యంగా సీఎం ప్రసంగం సాగింది. ముందుగా ప్రధాని మోదీ నుంచి మొదలు పెట్టి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వరకు విమర్శలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ చేసిన పని ఏమీలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీ ఆలస్యం చేయడంతో గిరిజనులు నష్టపోయిన తీరును వివరించారు. పార్లమెంట్‌లో తెలంగాణను తక్కువ చేసి మాట్లాడిన ప్రధాని మోదీని ఎలా సమర్థిస్తారని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ ఏ మొఖంతో ఓట్లు అడుగుతుందని చెప్పి అవునా.. కాదా.. అని ప్రజలతోనే చెప్పించారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం, బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందాలు, కేసీఆర్ బిడ్డ కోసం రాష్ట్రాన్ని బీజేపీ కాళ్లముందు వేశారని విమర్శలు చేశారు. 'ప్రభుత్వం కూలిపోతుంది.. పార్టీలు మారుతారు అన్న విషయంపై ఆషామాషీగా రాలేదని ఎన్నో ఎత్తుగడలతో వచ్చాం.. బీఆర్‌ఎస్‌ను తొక్కి వచ్చాం' అని చెప్పడంతో.. ప్రజలనుంచి ప్రతిస్పందన వచ్చింది.

సీఎం పర్యటన ఇలా..

- 3.12 గంటలకు హెలికాప్టర్ ల్యాండింగ్
- 3.15 నుంచి 5.14వరకు సీఎం రేవంత్‌రెడ్డి విశ్రాంతి
- 5.16 గంటలకు సభాస్థలికి చేరుకున్న సీఎం
- 5.51 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభం
- 6.17 గంటలకు ప్రసంగం ముగిసింది
- 6.18 గంటలకు మానుకోట ప్రజలకు అభివాదం చేశారు
- 6.25 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లారు.

జోష్ నింపుతూ ప్రసంగం

ముఖ్యమంత్రి ప్రసంగం కార్యకర్తలు, ప్రజల్లో జోష్‌ను నింపుతూ సాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించామని, ఇప్పుడు మోదీని ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియాగాంధీ చేసిన త్యాగం చెబుతూ.. అప్పటి ఎంపీలు సోనియాగాంధీకి బలిదానాల విషయం చెప్పిన తీరు.. ఆమె స్పందన, తల్లిగా అర్థం చేసుకుందని చెబుతూ.. ప్రజల్లో తెలంగాణ సెంటిమెంట్‌ను కదిలించారు. పదేళ్లలో బీజేపీ, బీఆర్‌ఎస్ ఏమీ చేయలేదని చెప్పి.. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతు రుణమాఫీ, ఉద్యోగాల నియామకం మొదలైన అంశాలను ప్రస్తావించారు. అదే తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశామని చెప్పి ప్రజలతో చెప్పించారు. ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటన చేయడంతో సభ ముందున్న వారందరూ చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. అయితే ముందుగా కుల సంఘాల నాయకులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకుల ప్రసంగాలు మొదలుకొని సీఎం ప్రసంగం వరకు అభ్యర్థి బలరాంనాయక్ స్టేజీకి అటు చివర నుంచి ఇటు చివరి వరకు నడుస్తూ.. ప్రజలకు అభివాదం చేయడం... తనను గెలిపించాలని చెప్పకనే చెప్పినట్లు సంకేతంగా మారింది.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, చిత్రంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామచంద్రునాయక్, కోరం కనకయ్య

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం 8లో▸

మానుకోటలో రెండో రోజు నాలుగు, వరంగల్‌లో మూడు నామినేషన్లు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మంత్రులు ఏమన్నారంటే.. 8లో▸

ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర కీలకం

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఓటు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ మానవహారం



మానవహారంలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు

హన్మకొండ అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర కీలకమని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేసి వారు కోరుకునే సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అదాలత్ జంక్షన్ వద్ద ఓటు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఓటర్లు నాయకులిచ్చే కానుకలు, డబ్బులకు లొంగకుండా సమర్థత, పారదర్శకత, బాధ్యతాయుత, జవాబుదారీతనం కలిగిన నాయకున్నే ఎన్నుకోవాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు ఓటర్లను చైతన్యపర్చేందుకు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఓటు ఫర్ ష్యూర్ అని ప్రతిజ్ఞ నిర్వహించి గాల్లోకి బెలూన్లని వదిలారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, రాధికాగుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్డీఓ నాగపద్మిని, డీడబ్ల్యూఓ కె.మధురిమ, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రాంరెడ్డి, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు భానుప్రసాద్, ఐఅండ్‌పీఆర్ డీఈ భూపాల్‌రెడ్డి, జిల్లా స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ పసునూరి సంపత్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సెర్ప్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

శ్రీహరికి పెద్ద మెదడు పని చేస్తలేదు

బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్



విలేకరులతో మాట్లాడుతున్న అరూరి రమేశ్

హన్మకొండ: ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పెద్ద మెదడు పని చేయట్లేదని, అందుకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఊసరవెల్లిలా పార్టీలు మారే శ్రీహరి.. తనపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. 'ఎమ్మెల్యేగా బ్రహ్మాండంగా పని చేశానని.. నన్ను పొగిడింది నువ్వే అన్న సంగతి మర్చిపోయావా' అని ప్రశ్నించారు. తాను వ్యాపారం చేసి భూములు సంపాదించానన్నారు. ఏ వ్యాపారం చేయని మీకు ఆస్తులు ఎలా వచ్చాయి? హైదరాబాద్ మై హోంలో ఇల్లు, హనుమకొండలో ఇంద్రభవనం లాంటి ఇల్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. మాదిగ జాతిలో ఎవరు ఎదిగినా కడియం శ్రీహరికి నచ్చదని ఆరోపించారు. కడియం శ్రీహరి రాసిచ్చిన స్క్రిప్ట్ కావ్య చదువుతోందని, ఔట్ సోర్సింగ్‌లో రూ.60 వేల జీతానికి ఉద్యోగం చేసిన కావ్యకు కార్లు, బంగళాలు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. అన్నింటికీ సమాధానం చెప్తానని, మీ జాతకాలు బయటపెడతానన్నారు. సమావేశంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవి కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కడియం రాజకీయ సమాధే నా పని

- మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

నయీంనగర్: కడియం శ్రీహరిని రాజకీయంగా సమాధి చేయడమే నా పని అని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని శుక్రవారం హనుమకొండ బాలసముద్రం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించుకుందామన్నారు. తెలంగాణ మొత్తం వరంగల్ వైపు చూస్తోందని.. కడియం శ్రీహరిని స్టేషన్ ఘన్‌పూర్ చెరువుల్లో తొక్కుదామన్నారు. కడియం దళిత ద్రోహి, దళిత దొర అని టీడీపీ హయాంలో లంచాలు తిని ఇప్పుడు తాను సత్యహరిశ్చంద్రుడినంటున్నాడని ఎద్దేవా చేశారు. 2009లో కడియంను ఓడగొడితే దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మెచ్చుకున్నారని, 14 ఏళ్లు కడియంను ఓడించిన ఘనత తనకు ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. పదేళ్ల పాలన చెబుతూ ప్రజల్లోకి వెళ్తామన్నారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి డా.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తాను పార్టీ కార్యకర్తనని 2001 నుంచి కేసీఆర్ వెంట నడిచానన్నారు. తాను పక్కా లోకల్ మాదిగ బిడ్డనని గల్లీ గల్లీ తెలుసన్నారు. కార్యక్రమంలో 'కుడా' మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, పశ్చిమ కో-ఆర్డినేటర్లు పులి రజనీకాంత్, జనార్దన్‌గౌడ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌కే.. ఆర్జేడీ కార్యాలయం

- గతేడాది తరలింపు.. మళ్లీ ఇక్కడే ఏర్పాటుకు నిర్ణయం
- ఉత్తర్వులు జారీ
- తీరిన అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగుల వెతలు

విద్యారణ్యపురి : దశాబ్దాలుగా హనుమకొండలో కొనసాగిన ఇంటర్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) వరంగల్ కార్యాలయాన్ని గతేడాదిలో హైదరాబాద్‌కు తరలించగా.. తిరిగి ఇక్కడే కొనసాగించాలని నిర్ణయించారు. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్జేడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జయప్రదబాయి ఆన్‌డ్యూటీ(ఓడీ)పై హైదరాబాద్‌లోని ఇంటర్ విద్య కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ అక్కడి నుంచే హనుమకొండలోని కార్యాలయంలో పాలనను కూడా కొనసాగించారు. ఆర్జేడీ కార్యాలయ పరిధిలో మల్టీజోన్-1, మల్టీజోన్-2లోని జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలున్నాయి. సుమారు 407 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించిన అధ్యాపకుల, నాన్‌టీచింగ్ ఉద్యోగుల సర్వీస్ మ్యాటర్లన్నీ ఆర్జేడీ పరిధిలోనే ఉండేవి. అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఆర్జేడీ కార్యాలయాన్ని తరలించగా ఉద్యోగులంతా కలిసి ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదు. కానీ.. కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఆయా సంఘాల బాధ్యులు మంత్రులు, సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రయత్నాలు ఫలించాయి. యథావిధిగా వరంగల్‌లో పూర్తిస్థాయిలో ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని కొనసాగించాల్సిందిగా ఈనెల 16న ఉత్తర్వులు జారీచేశారు.

ప్రస్తుతం మల్టీజోన్-1లో 265 కళాశాలలు.. ఆఫీస్ మళ్లీ అద్దె భవనంలోనేనా?

ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఇంటర్ విద్య ఆర్‌జేడీ ఆఫీసును హనుమకొండలో ఏర్పాటుచేశారు. అప్పట్లో ఐదో జోన్, ఆరోజోన్ల పరిధిలో ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ మ్యాటర్లు అన్ని ఇక్కడే పరిష్కారం అయ్యేవి. తెలంగాణలో మల్టీజోన్-1 పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా మల్టీజోన్-2 పరిధిలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. అయితే హనుమకొండలోనే రెండు జోన్‌లకు సంబంధించిన ఆర్జేడీ కార్యాలయాలు కొనసాగేవి. అయితే క్రమంగా మల్టీజోన్-1కు సంబంధించిన ఫైళ్లను రాజధానికి తరలించారు. కాగా మల్టీజోన్-2 తరలించినా ఫర్వాలేదు. కానీ, మల్టీజోన్-1 ఇక్కడే కొనసాగించాలని ఆయా సంఘాల బాధ్యులు చేసిన ప్రయత్నాలు అప్పట్లో ఫలించలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మల్టీజోన్-1 ఆర్జేడీ కార్యాలయాన్ని హనుమకొండకు తరలించడంతో అధ్యాపకులు, ఉద్యోగులు, పెన్షనర్లలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

14 మంది ఉద్యోగులు వివిధ చోట్ల విధులు

హనుమకొండలోని ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయంలో అప్పట్లో పని చేస్తున్న 14 మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వివిధ జిల్లాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు, డీఐఈఓల కార్యాలయాల్లో పోస్టింగ్‌లు ఇవ్వడంతో వారు అక్కడే పనిచేస్తున్నారు. అయితే ఆర్జేడీగా జయప్రదబాయి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) యాదగిరి మాత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇంటర్ విద్య కమిషనర్ కార్యాలయంలోనే పనిచేస్తున్నారు.

ఆర్జేడీ ఆఫీస్ ఎక్కడ ఏర్పాటు చేస్తారు?

గతంలో హనుమకొండలోని సుబేదారి ప్రాంతంలో అద్దె భవనంలో ఆర్జేడీ మల్టీజోన్-1 కార్యాలయం కొనసాగేది. ఫైళ్లు పంపిన తరువాత, ఉద్యోగులను వేరేచోట పోస్టింగ్ ఇచ్చాక అద్దె భవనాన్ని ఖాళీ చేశారు. ఇప్పుడు ఆర్జేడీ కార్యాలయాన్ని మళ్లీ అద్దె భవనంలోనే ఏర్పాటు చేస్తారా? లేదా ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేస్తారా? అనేది వేచి చూడాల్సిందే. దీంతోపాటు మల్టీజోన్-1 జిల్లాలకు సంబంధించిన ఫైళ్లు ఇక్కడికి తరలించాల్సి ఉంటుంది.

పకడ్బందీగా రికార్డులు నిర్వహించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధిలీబన్



మాట్లాడుతున్న వ్యయ పరిశీలకుడు ధిలీబన్

కాజీపేట సెంటర్ : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన వ్యయ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.ధిలీబన్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ కుడా కాంప్లెక్స్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వ్యయ రికార్డులు పరిశీలించారు. అనంతరం వరంగల్ పశ్చిమ, పరకాల ఆర్డీఓ (ఏఆర్‌ఓ) కార్యాలయాలను సందర్శించి ఎన్నికల వ్యయ నమోదు తీరు, అకౌంటింగ్ టీంలు నమోదు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధిలీబన్ మాట్లాడుతూ ఈసీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అభ్యర్థుల ఆమోద, ఆమోద యోగ్యం కాని ప్రతి ఖర్చు వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీం, వీఎస్‌టీ, వీవీటీలు నియోజకవర్గాల వారీగా నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సమావేశాలు, ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చుల అకౌంట్లు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం పరకాల అసెంబ్లీ నియోజకవర్గం పరిధి కటాక్షపూర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీం నిర్వహణను పరిశీలించి నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ నోడల్ అధికారి రాంరెడ్డి, సంజీవరెడ్డి, వరంగల్ పశ్చిమ, పరకాల ఏఆర్‌ఓలు వెంకటేశ్, నారాయణ, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట సెంటర్ : దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ, హైదరాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన (అనాథ), తండ్రిని కోల్పోయిన (పాక్షిక అనాథ), పేదరికం, అక్రమ రవాణాకు గురైన, సంరక్షణ కేంద్రం, మహిళా సంస్థల్లో ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా (సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 240 సీట్లలో 70 శాతం బాలికలకు, 3 శాతం దివ్యాంగులకు కేటాయించనున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని వివరించారు. ఆసక్తి గల వారు కులం, ఆదాయం (అనాథ బాలికలకు అవసరం లేదు), తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, బోనోఫైడ్, టెన్త్ మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో హనుమకొండ కాకాజీ కాలనీలోని బాలరక్షాభవన్ కార్యాలయంలో మే 17 లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు 9701762709 నంబర్‌లో సంప్రదించాలని డీడబ్ల్యూఓ కోరారు.

188 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు

వరంగల్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సీహెచ్.శివప్రసాద్‌రెడ్డి

ఖిలా వరంగల్ : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని వరంగల్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సీహెచ్.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 188 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు తెలిపారు. 55 ఐకేపీ సెంటర్ల ద్వారా 1,315.600 మెట్రిక్ టన్నులు, 130 పీఏసీఎస్‌ల ద్వారా 421.480 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు. ఇప్పటి వరకు రూ.3.83 కోట్ల విలువైన 1737.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. 17 శాతంలోపు తేమ కలిగి, శుభ్రం చేసిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. గ్రేడ్-ఏ రకానికి రూ.2203, కామన్ రకానికి రూ.2,183 మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించిదని పేర్కొన్నారు. రైతులకు ఏమైనా సందేహాలు, ఇబ్బందులు వస్తే 7995050785 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరుగురు విద్యార్థుల డీబార్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రసాయనశాస్త్రం సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్ తెలిపారు.

రూ.7.72 లక్షల నగదు స్వాధీనం



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఖిలావరంగల్/ రామన్నపేట : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అధ్వర్యంలో శుక్రవారం నగరంలోని అండర్ బ్రిడ్జి, శివనగర్ ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా డబ్బులు రవాణా చేస్తున్న వరంగల్ చార్‌బౌలి ప్రాంతానికి చెందిన చిన్నెపల్లి దిలీప్ వద్ద రూ.6.70లక్షలు, శాంతినగర్‌కు చెందిన చిదిరాల మయూరి వద్ద రూ.1,02,000లను మొత్తం రూ.7.72లక్షల నగదు స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జ్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మట్టెవాడ, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్లు టి.గోపి, పి.మల్లయ్య, ఎస్సైలు విఠల్, వెంకన్న, గాలిబ్ షరీఫ్, మునీరుల్లా, గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

డీజిల్ కాలనీలో రూ.1.53లక్షలు..

కాజీపేట: కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీల్లో రూ.1.53లక్షల నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టోరియల్ అధికారితో కలిసి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా వేలేరు మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి శ్రీనివాస్ ద్విచక్ర వాహనంలో డబ్బులు తరలిస్తూ పట్టుబడ్డారు. పంచుల సమక్షంలో డబ్బులను స్వాధీనం చేసుకుని హనుమకొండ జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

అక్కడ పోలింగ్.. ఇక్కడ మావోల కట్టడి!



కాళేశ్వరం బార్డర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: మహారాష్ట్రలో పార్లమెంట్ ఎన్నికలకు మొదటి విడత పోలింగ్‌ను అక్కడి అధికారులు శుక్రవారం కట్టుదిట్టంగా నిర్వహించారు. సరిహద్దుల్లో మావోల కట్టడికి ఇక్కడి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఓ వైపు పోలింగ్ సజావుగా సాగేందుకు మహారాష్ట్ర పోలీసులు చర్యలు తీసుకుంటూనే.. సరిహద్దులతోపాటు అడవులను జల్లెడ పడుతున్నారు. శుక్రవారం బార్డర్ చెక్‌పోస్టు వద్ద మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సై భవానిసేన్‌లు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లకు వచ్చిపోయే వాహనాలను తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్సుల తోపాటు ప్రైవేట్ వాహనాలను సోదా చేశారు. అపరిచితులు కనిపిస్తే విచారించి వదిలేశారు.

ఎన్‌కౌంటర్‌తో..

ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో చోటే బిటియా పరిధి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన 29 మంది మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే. కాగా, జిల్లాకు చెందిన శంకర్‌రావు అలియాస్ సుధాకర్ అతని భార్య రజిత మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టులు గోదావరి ప్రాంతాలు దాటి తెలంగాణలోకి వచ్చే అవకాశం ఉండడం తోపాటు ప్రతికారదాడులకు పాల్పడే అవకాశం ఉండడంతో పోలీసులు సరిహద్దుల్లో పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. అడవుల్లో జల్లెడపడుతున్నారు. భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు.

వెయ్..చిందెయ్



వెయ్..చిందెయ్ అంటూ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హడావుడి చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌తోపాటు తాటికొండ రాజయ్య, జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజయ్య తెలంగాణ పాటకు నృత్యం చేస్తూ కార్యకర్తల్లో జోష్ నింపారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ

సెల్ఫీ పాయింట్



ఓటుహక్కు ప్రాధాన్యం చైతన్యం కల్పించడంలో భాగంగా వరంగల్ కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య, అధికారులతో కలిసి సెల్ఫీ దిగి ప్రారంభించారు. పబ్లిక్‌గార్డెన్, వరంగల్ రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ల వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి యువకులను ఆకర్షించి ఓటు నమోదు శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ శ్రీనివాస్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీసీఓ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కాళోజీ సెంటర్

రామయ్యా.. గెలిపించు



మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోరిక బలరాంనాయక్ శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా మానుకోటలోని రామాలయంలో కూర్చొని నామినేషన్ పత్రాలను పూరించి, ఎంపీగా గెలిపించాలని కోరుకున్నారు.

విభిన్న తీర్పు

వరంగల్ ఎంపీ స్థానంలో గతంలో కాంగ్రెస్, టీడీపీ, బీ(టీ)ఆర్ఎస్ హవా..

- ప్రస్తుతం గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ప్రచారం
- ప్రధానపార్టీలకు ప్రతిష్టాత్మకంగా ఓరుగల్లు పార్లమెంట్ స్థానం



కమాలుద్దీన్ | ఆర్.సురేందర్‌రెడ్డి | చందూలాల్ | రవీంద్రనాయక్



కల్పనాదేవి | చాడ సురేష్‌రెడ్డి | సిరిసిల్ల రాజయ్య | బి.వినోద్‌కుమార్ | ఎర్రబెల్లి దయాకర్‌రావు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఒకప్పుడు కాంగ్రెస్.. ఆ తర్వాత టీడీపీకి కంచుకోటగా ఉన్న వరంగల్ (హనుమకొండ) పార్లమెంట్ నియోజకవర్గంపై తర్వాత గులాబీ పార్టీ జెండా ఎగురవేసింది. తెలంగాణలో ప్రాధాన్యం కలిగిన స్థానాల్లో వరంగల్ ఒకటి. హనుమకొండ ఆ తర్వాత.. 2009 పునర్విభజనతో ఏర్పడిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి 1952 నుంచి 2019 వరకు మూడు ఉప ఎన్నికలు కలుపుకుని మొత్తం 20 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఏడుసార్లు కాంగ్రెస్, రెండు సార్లు కాంగ్రెస్(ఐ) అభ్యర్థులు విజయం సాధించగా, టీడీపీ ఐదు, బీ(టీ)ఆర్ఎస్ నాలుగు, టీపీఎస్, పీడీఎఫ్ పార్టీలు ఒక్కోసారి గెలుపొందాయి. బీ(టీ)ఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం తర్వాత వచ్చిన 2004ఎన్నికల్లో ధరావత్ రవీంద్రనాయక్ గెలుపొందారు. ఆ తర్వాత 2008 ఉపఎన్నికలో టీడీపీ, 2009లో కాంగ్రెస్ గెలుపొందాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి ఎన్నికల నుంచి బీ(టీ)ఆర్ఎస్ ఈ నియోజకవర్గంపై పట్టు సాధించింది.

కాంగ్రెస్, టీడీపీల కంచుకోట..

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్, 1993 తర్వాత టీడీపీలకు కంచుకోటగా ఉంది. 1952 తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు పీడీఎఫ్ అభ్యర్థి పెండ్యాల రాఘవరావుపై 3,613 ఓట్ల తేడాతో ఓటమి చెందగా.. ఆ తర్వాత వరుసగా మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. 1957లో ఎస్ఏ ఖాన్, 1962లో బీఏ మీర్జా, 1967లో ఆర్.సురేందర్‌రెడ్డిలు (కాంగ్రెస్) గెలుపొందారు. 1971లో టీపీఎస్‌కు చెందిన ఎస్‌బీ గిరి కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రెడ్డిపై గెలుపొందగా, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎస్‌బీ గిరి, 1977లో బీఎల్‌డీ అభ్యర్థి జంగారెడ్డి మరోసారి విజయం సాధించారు. ఆ తర్వాత 1979ఉపఎన్నికల్లో బీఎం రావు కాంగ్రెస్ (ఐ) నుంచి, 1980లో కమాలోద్దీన్ అహ్మద్ కాంగ్రెస్ (ఐ) నుంచి గెలిచారు. 1984లో టీడీపీ నుంచి పోటీ చేసిన డాక్టర్ టి.కల్పనాదేవి కాంగ్రెస్ అభ్యర్థి కమాలోద్దీన్ అహ్మద్‌ను ఓడించారు. ఆ తర్వాత 1989, 1991లలో వరుసగా కాంగ్రెస్ అభ్యర్థిగా ఆర్.సురేందర్ రెడ్డి టీడీపీ అభ్యర్థులు కల్పనాదేవి, ఎస్.యతిరాజారావులపై గెలుపొందగా, 1996 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్.సురేందర్‌రెడ్డిని టీడీపీ అభ్యర్థిగా అజ్మీరా చందూలాల్ ఓడించారు. 1998లోనూ టీడీపీ నుంచి చందూలాల్ గెలుపొందగా, 1999లో టీడీపీ టికెట్ దక్కించుకున్న బోడకుంటి వెంకటేశ్వర్లు విజయం సాధించారు. 2004లో డీ.రవీందర్ నాయక్ (బీ(టీ)ఆర్ఎస్), 2008 ఉప ఎన్నికలో ఎర్రబెల్లి దయాకర్‌రావు (టీడీపీ), 2009లో సిరిసిల్ల రాజయ్య (కాంగ్రెస్) ఎంపీలుగా గెలుపొందగా, 2014లో బీ(టీ)ఆర్ఎస్ నుంచి పోటీ చేసిన కడియం శ్రీహరి 3,92,574 ఓట్లతో గెలుపొందారు. ఆ తర్వాత తెలంగాణ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కడియం శ్రీహరి ఎంపీగా రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికల్లో బీ(టీ)ఆర్ఎస్ అభ్యర్థిగా పసునూరి దయాకర్ కాంగ్రెస్ అభ్యర్థి సర్వే సత్యనారాయణపై 4,59,403 ఓట్ల మెజార్టీతో గెలుపొంది రికార్డు నెలకొల్పారు. 2019 ఎన్నికల్లో రెండోసారి దయాకర్.. కాంగ్రెస్ అభ్యర్థి దొమ్మాటి సాంబయ్యపై 3,50,298 ఓట్లతో విజయం సాధించారు. ఒకప్పుడు కాంగ్రెస్, టీడీపీలకు కంచుకోటగా ఉన్న వరంగల్ నుంచి వరుసగా మూడు సార్లు భారీ మెజార్టీతో గెలిచిన బీ(టీ)ఆర్ఎస్ పరిస్థితి ఈసారి భిన్నంగా ఉంది. నిన్నటి వరకు బీ(టీ)ఆర్ఎస్‌లో ఉన్న కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యలు కాంగ్రెస్‌లో చేరగా ఆయన కూతురు ఆ పార్టీ అభ్యర్థిగా ఉండగా.. బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పోటీ చేస్తున్నారు. బీ(టీ)ఆర్ఎస్ నుంచి హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ బరిలో నిలవగా.. ముగ్గురి మధ్య పోటీ రసవత్తరంగా సాగుతోంది. ఈక్రమంలో ఈ ఎన్నికల్లో ఓరుగల్లు కోటపై ఎవరి జెండా ఎగురుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.





పీవీ. నరసింహారావు



చందుపట్ల జంగారెడ్డి



కడియం శ్రీహరి



పసునూరి దయాకర్

హనుమకొండలో పీవీ ఓటమి..

హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గానికి రికార్డుల పరంపర ఉంది. ఇక్కడ కాంగ్రెస్ ఒకసారి, కాంగ్రెస్(ఐ) నాలుగుసార్లు, టీడీపీ రెండు సార్లు, బీజేపీ ఒకసారి, బీ(టీ)ఆర్ఎస్ రెండుసార్లు గెలిచాయి. దేశానికి ప్రధానిగా సేవలు అందించిన పీవీ నరసింహారావు ప్రాతినిథ్యం వహించిన హనుమకొండ నియోజకవర్గం 2009 నుంచి రద్దు అయింది. నరసింహారావు రెండుసార్లు ఇక్కడ నుంచి గెలుపొందారు. ఆయన రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధాన మంత్రిగా పనిచేసి రాష్ట్రానికి వన్నె తెచ్చారు. కాగా, ఇక్కడ మూడుసార్లు గెలిచిన కమాలుద్దీన్ అహ్మద్ వరంగల్‌లో ఒకసారి గెలుపొందారు. టీడీపీ పక్షాన చాడ సురేష్‌రెడ్డి రెండు సార్లు గెలిచారు. ఇక్కడ రెండుసార్లు గెలిచిన బీ(టీ)ఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ నుంచి మరోసారి గెలుపొందారు. సీనియర్ బీజేపీ నేత జంగారెడ్డి 1984లో పీవీ నరసింహారావును ఓడించడం అప్పట్లో సంచలనంగా మారింది.

హనుమకొండ పార్లమెంట్..

చిన	అభ్యర్థి	పార్టీ	సమీపఅభ్యర్థి	పార్టీ	మెజార్టీ
1977	పీవీ.నరసింహారావు	కాంగ్రెస్	పీ.జనార్ధనరెడ్డి	బీ.ఎల్‌డీ	77,683
1980	పీవీ.నరసింహారావు	కాంగ్రెస్(ఐ)	పీ.జనార్ధనరెడ్డి	కాంగ్రెస్(యూ)	1,62,949
1984	సి.జంగారెడ్డి	బీజేపీ	పీవీ.నరసింహారావు	కాంగ్రెస్	54,198
1989	కమాలుద్దీన్ అహ్మద్	కాంగ్రెస్	సి.జంగారెడ్డి	బీజేపీ	63,343
1991	కమాలుద్దీన్ అహ్మద్	కాంగ్రెస్	వంగా సుదర్శన్‌రెడ్డి	టీడీపీ	64,463
1996	కమాలుద్దీన్ అహ్మద్	కాంగ్రెస్	ఎ.బస్వారెడ్డి	టీడీపీ	75,570
1998	చాడ సురేష్‌రెడ్డి	టీడీపీ	కమాలుద్దీన్ అహ్మద్	కాంగ్రెస్	45,491
1999	చాడ సురేష్‌రెడ్డి	టీడీపీ	కమాలుద్దీన్ అహ్మద్	కాంగ్రెస్	85,781
2004	బీ.వినోద్‌కుమార్	బీ(టీ)ఆర్ఎస్	చాడ సురేష్‌రెడ్డి	టీడీపీ	2,17,087
2008 (ఉ.ప)	బీ.వినోద్‌కుమార్	బీ(టీ)ఆర్ఎస్	కొండా సురేఖ	కాంగ్రెస్	55,264

వరంగల్ పార్లమెంట్..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీపఅభ్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	పెండ్యాల రాఘవరావు	పీడీఎఫ్	కాళోజీ నారాయణరావు	కాంగ్రెస్	3,613
1957	ఎస్.ఎ ఖాన్	కాంగ్రెస్	పెండ్యాల రాఘవరావు	పీడీఎఫ్	14,955
1962	బీ.ఎ మీర్జా	కాంగ్రెస్	ఎస్.రామనాథం	సీపీఐ	736
1967	ఆర్.సురేందర్‌రెడ్డి	కాంగ్రెస్	ఎల్.ఎస్ రాజు	బీజేఎస్	69,945
1971	ఎస్.బీ గిరి	టి.పి.ఎస్	కే.ఎస్ రెడ్డి	కాంగ్రెస్	93,640
1977	ఎస్.బీ గిరి	కాంగ్రెస్	సీ.జంగారెడ్డి	బీఎల్‌డీ	1,22,622
9-1-79(ఉప)	బీ.ఎం రావు	కాంగ్రెస్(ఐ)	క్యు.ఎ.అబీబ్	జనతా	12,258
1980	కమాలుద్దీన్ అహ్మద్	కాంగ్రెస్(ఐ)	టీ.పురుషోత్తం	కాంగ్రెస్(యూ)	1,22,042
1984	కల్పనాదేవి	టీడీపీ	కమాలుద్దీన్ అహ్మద్	కాంగ్రెస్	8,456
1989	ఆర్.సురేందర్‌రెడ్డి	కాంగ్రెస్	టి.కల్పనాదేవి	టీడీపీ	54,121
1991	ఆర్.సురేందర్‌రెడి	కాంగ్రెస్	ఎస్.యతిరాజారావు	టీడీపీ	51,873
1996	అజ్మీరా చందూలాల్	టీడీపీ	టి.సురేంద్రరెడ్డి	కాంగ్రెస్	17,440
1998	అజ్మీరా చందూలాల్	టీడీపీ	టి.కల్పనాదేవి	కాంగ్రెస్	24,801
1999	బోడకుంటి వెంకటేశ్వర్లు	టీడీపీ	టి కల్పనాదేవి	కాంగ్రెస్	13,366
2004	డి.రవీంద్రనాయక్	బీ(టీ)ఆర్ఎస్	బోడకుంటి వెంకటేశ్వర్లు	టీడీపీ	19,262
2008(ఉప)	ఎర్రబెల్లి దయాకర్‌రావు	టీడీపీ	పి.రామేశ్వర్‌రెడ్డి	కాంగ్రెస్	4,386
2009	సిరిసిల్ల రాజయ్య	కాంగ్రెస్	రామగళ్ల పరమేశ్వర్	బీ(టీ)ఆర్ఎస్	1,24,661
2014	కడియం శ్రీహరి	బీ(టీ)ఆర్ఎస్	ఎస్.రాజయ్య	కాంగ్రెస్	3,92,574
2015	పసునూరి దయాకర్	బీ(టీ)ఆర్ఎస్	సర్వే సత్యనారాయణ	కాంగ్రెస్	4,59,403
2019	పసునూరి దయాకర్	బీ(టీ)ఆర్ఎస్	దొమ్మాటి సాంబయ్య	కాంగ్రెస్	3,50,298

ఫిర్యాదులకు అధికారులను సంప్రదించొచ్చు

- కలెక్టర్ ప్రావీణ్య

కాళోజీ సెంటర్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు, సలహాలు, సూచనలకు సంప్రదించవచ్చని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ.దిలీబర్(సెల్ నం: 8309921306), వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగా (సెల్ నం: 83099 52057)కు ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, ఈనెల 24వ తేదీ నుంచి నగరంలోని హరిత హోటల్‌లో సూట్ నం.309లో వ్యయ పరిశీలకులు ఏ.దిలీబర్, సూట్ నం.314లో వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగాను సాయంత్రం 4నుంచి 5గంటల మధ్యన నేరుగా కూడా కలువచ్చని తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: సమూహ లౌకిక విలువలు -సాహిత్యం అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సును ఈనెల 28న కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనాభవనం సెనెట్‌హాల్‌లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఫోరం బాధ్యులు, కవులు, రచయితలు, ఆహ్వాన సంఘం సభ్యులు లోచన్, అంపశయ్య నవీన్, కాత్యాయనీ విద్మహే, రచయిత విద్యార్థి, గంటా రామిరెడ్డి శుక్రవారం సాయంత్రం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు.

ముగిసిన సుధాకర్ దంపతుల ప్రస్థానం

- ప్రజా బిడ్డలకు చావులేదు: ప్రజాసంఘాల నాయకులు
- చల్లగరిగెలో అంత్యక్రియలు పూర్తి

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ప్రస్థానం శుక్రవారం నాటికి ముగిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేడ్ జిల్లా మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, అతని భార్య సుమన అలియాస్ రజిత మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు శుక్రవారం తెల్లవారుజామున చల్లగరిగెకు మృతదేహాలను తీసుకొచ్చారు. గ్రామస్తులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర నాలుగు గంటల పాటు సాగింది. అనంతరం ముచినిపర్తి గ్రామ శివారులో మావోయిస్టు దంపతుల మృతదేహాలను పక్కపక్కనే ఖననం చేశారు. ఇదిలా ఉండగా.. అంత్యక్రియల నేపథ్యంలో పోలీస్ బలగాలు గ్రామాన్ని చుట్టుముట్టినట్లు తెలిసింది.కాగా, 25 ఏళ్ల క్రితం అడవిబాట పట్టిన సుధాకర్ మధ్యలో ఏనాడూ ఊరిలోకి రాలేదని, శవమై తిరిగొచ్చాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



మృతదేహాల వద్ద నినాదాలు చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

బూటకపు ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అదివాసులకు అండగా నిలిచిన మావోయిస్టులను అన్యాయంగా కాల్చి చంపుతున్నారని ఇది ముమ్మాటికి బూటకపు ఎన్‌కౌంటర్ అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు.

ప్రజా బిడ్డలకు చావు లేదు

ఉద్యమంలో చనిపోయిన సుధాకర్- సుమన దంపతులు ప్రజా బిడ్డలేనని వారికి ఎప్పటికీ చావు లేదని.. అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం హత్యకాండను పోత్సహిస్తుందని ఆరోపించారు. నివాళులర్పించిన వారిలో శాంతక్క, శోభ, శ్రీపతి రాజగోపాల్, గుమ్మడి కొమురయ్య, అంజన్న, మార్వాది సుదర్శన్, హుస్సేన్, విరసం నేతలు, బంధుమిత్రులు ఉన్నారు.

మంత్రులు ఏమన్నారంటే..

మహబూబాబాద్: కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ నామినేషన్ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అధ్యక్షతన నిర్వహించిన జన జాతర బహిరంగ సభలో మంత్రులు మాట్లాడారు.

బీఆర్ఎస్ నాయకులు నోరు దగ్గర పెట్టుకోవాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలి. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు కోల్పోయారు. రెండుసార్లు పీఎంగా రాహుల్‌గాంధీకి అవకాశం వచ్చినా తీసుకోలేదు. మాజీ సీఎం కేసీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిని లిల్లిపుట్టు అని సంభోదించారు.. వరంగల్ మిరపకాయ కారం కేసీఆర్‌కు తెలియదు.. రేవంత్‌రెడ్డికి తెలుసు.. సమయం వచ్చినప్పుడు ఎక్కడపెట్టాలో అక్కడ పెడుతారన్నారు. కేసీఆర్‌కు చిప్పకూడు తినే రోజులు దగ్గర పడ్డాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ ఫోన్ ట్యాపింగ్ చేసి ప్రజల స్వేచ్ఛను హరించింది. దానిలో భాగస్వామ్యం ఉన్న వారందరికీ భవిష్యత్‌లో శిక్షణ తప్పదు.

వంద రోజుల్లోనే రేవంత్ మార్క్ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సీఎం రేవంత్‌రెడ్డి అద్భుత పాలన అందిస్తున్నారు. వంద రోజులలోనే తనదైన మార్కు వేసుకున్నారు. సీఎం పట్టుదల దూర దృష్టి ఉన్న నాయకుడు. గత ప్రభుత్వ చేసిన అప్పులు తీర్చలేరు. లోప భూయిష్టమైన పాలన ఉంది.. సాధ్యం కాదని బీఆర్ఎస్ అనుకున్నారు.. దానిని సీఎం గాడిలో పెట్టారు. 15స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం. బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

బలరాంనాయక్ భోళా శంకరుడు : మంత్రి ధనసరి సీతక్క



గ్యారంటీలకే గ్యారంటీ సీఎం రేవంత్‌రెడ్డి. అభ్యర్థి బలరాం నాయక్ మోసాలు తెలియని భోళా శంకరుడు. మోదీ ప్రభుత్వం జీఎస్టీల పేరుతో పేదలపై భారం మోపింది. భగవంతుని భక్తుని అనుసంధానమైన అగర్ బత్తిపై కూడా జీఎస్టీ విధించింది. దేశం కోసం స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీని పీఎం చేయాలి. ఉపాధిహామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాలని కాంగ్రెస్ తీసుకొస్తే బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుంది.

జన జాతర సభలో ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, డోర్నకల్, మహబూబాబాద్, భద్రాచలం, పినపాక, ఇల్లెందు, పాలకుర్తి ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, భూక్య మురళీనాయక్, తెల్లం వెంకట్రాం, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, యశస్వినిరెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, బెల్లయ్య నాయక్, రియాజ్, జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, నాయకులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌లాల్, ఘనపురపు అంజయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి, అజయ్‌సారథిరెడ్డి, డాక్టర్ భూక్య ఉమ, చుక్కల ఉదయ్‌చందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

- నామినేషన్ దాఖలు చేసిన మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్



వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న పంజా కల్పన

మహబూబాబాద్: మానుకోట పార్లమెంట్ నియోజకవర్గానికి రెండో రోజు నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు వెల్లడించారు. ములుగు నియోజకవర్గం మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక బలరాంనాయక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, నాయకులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, ఘనపురపు అంజయ్య, నూనావత్ రాధ, ఎడ్ల రమేష్ ఉన్నారు. బలరాంనాయక్ నాయక్ రెండు సెట్లు దాఖలు చేశారు. పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన పాల్వంచ దుర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన జాటోత్ రఘునాయక్ ఆధార్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నర్సంపేట నియోజకవర్గం ఇటుకాలపల్లి గ్రామం ఏనుగుల తండాకు చెందిన బోడ అనిల్ నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. రెండు రోజుల్లో ఐదు నామినేషన్‌లు, ఆరు సెట్లు పత్రాలు అందినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్‌ల ప్రక్రియలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్, ఆర్డీఓలు అలివేలు, నర్సింహరావు, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, దామోదర్, శ్వేత, సునీల్‌రెడ్డి, పర్యవేక్షణ అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వరంగల్‌లో ముగ్గురి నామినేషన్

కాళోజీ సెంటర్ : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి శుక్రవారం రెండో రోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థిగా పంజా కల్పన, స్వతంత్ర అభ్యర్థిగా పేరంబుదూరి కృష్ణసాగర్, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థిగా ఏఆర్ సేనా ప్రేమ్‌రెడ్డి రిపిక, స్వతంత్ర అభ్యర్థిగా (1) సెట్ మొత్తం 2 సెట్‌ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. ఇప్పటి వరకు మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఏడు నామినేషన్ల పత్రాలు సమర్పించారు. ఇందులో ఏఆర్ సేనా ప్రేమ్‌రెడ్డి రిపిక రెండు సెట్‌ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.